సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



కియోస్క్ యంత్రాలు ప్రారంభం

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఏర్పాటు చేసిన స్వీయ సేవా కియోస్క్ యంత్రాలను ఈఓ ప్రారంభించారు. - 8లో



మెరుగైన సేవలు అందించాలి

రోగులకు మెరుగైన సేవలు అందించాలని పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ రవీంద్రనాయక్ సూచించారు. - 8లో



వీడని 'మూసీ' కష్టాలు

రుద్రవెల్లి–జూలూరు మధ్య మూసీ నదిపై చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. - 9లో

న్యూస్‌రీల్

21 సంఘాలకు రూ.3.15 లక్షలు విడుదల

భువనగిరి: స్వయం సహాయక మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్ విడుదల చేసింది. జిల్లాలో 14,848 సంఘాలు ఉండగా ఇందులో కొత్తగా ఏర్పాటైన 21 సంఘాలకు రూ.3,15,000 విడుదలయ్యాయి. ఒక్కో సంఘానికి రూ.15 వేల చొప్పున కేటాయించనున్నారు. ఈ నిధుల వినియోగాన్ని గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా, మండల, గ్రామ మహిళా సమాఖ్యలు పర్యవేక్షించనున్నాయి. ఈ నిధులను ఆయా సంఘాల్లోని సభ్యులకు రుణాల రూపంలో ఇవ్వనున్నారు.

మత్స్యగిరి క్షేత్రంలో కలెక్టర్ దంపతుల పూజలు



హారతి తీసుకుంటున్న కలెక్టర్ దంపతులు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం కలెక్టర్ హనుమంతరావు కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు, స్వామివారి ఫొటో బహూకరించారు.

నేడు, రేపు వర్ష సూచన

భువనగిరిటౌన్ : జిల్లాలోని పలు మండలాల్లో నేడు, రేపు (ఆది, సోమవారం) మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. వర్షంతో పాటు 30 నుంచి40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయవచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాగా శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. రామన్నపేటలో 56 మి.మీ, సంస్థాన్‌నారాయణపురంలో 46 మి.మీ, తుర్కపల్లి 41 మి.మీ, బీబీనగర్ 27 మి.మీ, మోటకొండూరు 25 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఆలేరు అభివృద్ధికి మరిన్ని నిధులివ్వండి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఆలేరు నియోజకవర్గ సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సీఎంతో చర్చించారు. మరిన్ని నిధులిచ్చి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

ఎన్‌సీసీ అధికారికి కెప్టెన్‌గా పదోన్నతి

ఆలేరు: ఆలేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్‌కు పదోన్నతి లభించింది.ఎన్‌సీసీ సెకండ్ (లెఫ్టినెంట్) ఆఫీసర్‌గా కొనసాగుతున్న ఆయనకు..ఫస్ట్ ఆఫీసర్(కెప్టెన్)గా పదోన్నతి కల్పిస్తూ ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ ఆదేశాలు జారీ చేశారు. నాగపూర్‌లోని ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీలో శిక్షణ కోర్సు పూర్తి చేసిన నేపథ్యంలో ఆయనకు లెఫ్టినెంట్ నుంచి కెప్టెన్‌గా పదోన్నతి దక్కింది. శుక్రవారం వరంగల్ జిల్లా మామూనూరు పోలీసు శిక్షణ కేంద్రంలో జరిగిన పిప్పింగ్ సెర్మనీలో వెంకటేష్‌కు కల్నల్ రామదురై, అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే ర్యాంకులు తొడిగి అభినందనలు తెలిపారు. పదవ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు ఆయనకు అభినందించారు.



దూడల వెంకటేష్‌కు ర్యాంకులు తొడుగుతున్న కల్నల్ రామదురై, లెఫ్టినెంట్ కల్నల్ సునారే

నేత్రపర్వంగా నిత్యకల్యాణం



యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలో భాగంగా నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. అనంతరం గర్భాలయంలో స్వయంభూలను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం , బ్రహ్మోత్సవం ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఆలయంలో ఊరేగించారు. వివిధ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు



విద్యా కల్పవృక్షం.. ఎంజీయూ

2007లో 500 మంది విద్యార్థులతో ప్రారంభమైన మహాత్మాగాంధీ యూనివర్సిటీ.. నేడు 2,500 మందికి ఉన్నత విద్యనందిస్తూ పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యా కల్పవృక్షంగా మారింది.

- ప్రత్యేక కథనం 8లో

నాటుదాం ఒక మొక్క.. అమ్మ పేరున

నేడు 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమం

- ప్రతి విద్యార్థి మొక్క నాటేలా కార్యాచరణ
- లక్ష్యం 10 వేల మొక్కలు
- విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



భువనగిరి: భవిష్యత్ తరాలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఆదివారం ఏక్ పేడ్ మాకే నామ్ (అమ్మపేరు మీద ఒక చెట్టు) కార్యక్రమానికి పూనుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో మొక్కలు నాటించనుంది. ఒకే రోజు 10 వేల మొక్కలు నాటించాలని విద్యాశాఖ లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసింది.

45 వేల మంది విద్యార్థులు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలకు చెందిన 6 నుంచి 12వ తరగతి వరకు 45 వేల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి విద్యార్థి వారి తల్లి పేరు మీద మొక్క నాటనున్నారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించి ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. అవసరమైతే తల్లితో కలిసి విద్యార్థులు మొక్క నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను విద్యార్థులకు అందజేయనున్నారు.

ఎంపిక చేసిన ప్రాంతాలు..

లక్ష్యం మేరకు ఒకే రోజు 10 వేల మొక్కలు నాటేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. పాఠశాలల ఆవరణ, ఇంటి పరిసరాలు, ఇతర ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటనున్నారు. విద్యార్థులు మొక్కలు నాటే క్రమంలో ఫొటో తీసుకుని వెంటనే ఏకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం విద్యార్థులకు మొక్కలు నాటినట్లుగా సర్టిఫికెట్ వస్తుంది.

విద్యార్థులంతా మొక్కలు నాటాలి



ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా 6 నుంచి 12వ తరగతి వరకు ప్రతి విద్యార్థి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మొక్కలు నాటాలి. ఒకే రోజు లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. పాఠశాలల ఆవరణలు, ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటవచ్చు. విద్యార్థులంతా మొక్కలు నాటేలా వారిని సంసిద్ధులను చేయాలని ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలకు సూచించాం. ఈ కార్యక్రమం ద్వారా పచ్చదనం పెంచడంతో పాటు విద్యార్థులకు చెట్ల ప్రాధాన్యత తెలుస్తుంది.

–సత్యనారాయణ, డీఈఓ

ఒక్క రోజే 36,182 కేసులు పరిష్కారం

- జాతీయ లోక్ అదాలత్‌కు భారీ స్పందన
- రాజీపడిన పలువురు కక్షిదారులకు అవార్డు కాపీలు అందజేత



భూమి కొనుగోలు వివాదాన్ని పరిష్కరించుకున్న ఇరుపక్షాలకు అవార్డు కాపీ అందజేస్తున్న జడ్జిలు

భువనగిరిటౌన్ : జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి భారీ స్పందన లభించింది. ఒక్క రోజే 36,182 కేసులు పరిష్కారం అయ్యాయి. భువనగిరిలో లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు జయరాజు ప్రారంభించారు. రాజీమార్గం ద్వారా ఒక్కటైన దంపతులను, రూ.22 కోట్ల భూమి కొనుగోలు వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకున్న ఇరువర్గాలను, వారి తరపు న్యాయవాదులను అభినందించి అవార్డు కాపీలు అందజేశారు.

రాజీపడిన కేసులు

క్రిమినల్ 2,500, సివిల్ 14, ప్రిలిటిగేషన్, టెలిఫోన్ బకాయిలు, ఎస్‌బీఐ, టీజీ బ్యాంకుల కేసులు 76, ట్రాఫిక్ చలానాకు సంబంధించి 33,592 కేసులు ఉన్నాయి.

రాజీయే రాజమార్గం

కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఎంతో దోహదపడుతాయని జిల్లా ప్రధాన జడ్జి జయరాజు పేర్కొన్నారు. రాజీయే రాజ మార్గం అని, కక్షిదారులు చిన్నచిన్న కేసులను లోక్ అదాలత్‌లలో సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాధవిలత, అదనపు జిల్లా జడ్జి ముక్తిదా, అదనపు సీనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వాతి, పీపీలు, ఏపీపీలు సౌజన్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శవాలపై రోడ్డు నిర్మాణం చేస్తారా..

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు, నాయకులు

చౌటుప్పల్ : భూ నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను పరిగణలోకి తీసుకోకుండా వారి శవాలపై రోడ్డు నిర్మాణం చేస్తారా.. అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వెళ్తూ చౌటుప్పల్‌లో ఆగారు. రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం అయ్యారు. అలైన్‌మెంట్ మార్పునకు కృషి చేయాలని భూనిర్వాసితులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం.. నిర్వాసితుల విషయంలో ఎందుకు సానుకూలంగా ఆలోచించడం లేదన్నారు. నిర్వాసితులు చేస్తున్న పోరాటం న్యాయమైనదని, బేషజాలకు పోకుండా వారికి న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో భూ నిర్వాసితుల ఐక్యవేదిక కన్వీనర్ చింతల దామోదర్ రెడ్డి, నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, పల్లె శేఖర్‌రెడ్డి, సుర్వి యాదయ్య, బచ్చనగోని గాలయ్య,గంగదేవి సైదులు, బోరెం ప్రకాష్‌రెడ్డి, సందగళ్ల మల్లేష్‌గౌడ్, బొమ్మిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, పల్లె పుష్పారెడ్డి, పల్లె మధుకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

16న స్పాట్ అడ్మిషన్లు

భువనగిరి: మండలంలోని అనంతారం పూలే డిగ్రీ కాలేజీలో వివిధ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జెల్ల స్వప్న తెలిపారు. ఈ నెల 16న ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 76708 58056, 91334 412673ను సంప్రదించాలని కోరారు.

ఆలేరు అభివృద్ధికి మోక్షం

టీయూఎఫ్ఐడీసీ నిధులకు వీడిన గ్రహణం

- రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు కలెక్టర్ గ్రీన్ సిగ్నల్
- మరో రూ.15 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించిన అధికారులు



5వ వార్డులో గుంతలమయంగా అంతర్గత రోడ్డు

ఆలేరు: ఆలేరు పట్టణవాసుల అవస్థలు తీరనున్నాయి. మున్సిపల్ ఖజనాలో మూలుగుతున్న తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ.15 కోట్లు ఖర్చు చేయడానికి కలెక్టర్ పరిపాలనా అనుమతులు ఇచ్చారు. అభివృద్ధి పనులకు అధికారులు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో పాటు మున్సిపాలిటీకి చెందిన మరో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు పంపించారు.

రూ.12 కోట్లతో చేపట్టనున్న పనులు ఇవీ..

అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు. ఓపెన్ నాలాల వల్ల ఇళ్లు, కాలనీల మధ్య మురుగు నిలిచి జనం ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరహా సమస్యలు పరిష్కరించేందుకు టీయూఎఫ్ఐడీసీ నిధుల్లో రూ.12 కోట్లు ఖర్చు చేయనున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేయనున్నారు.

మున్సిపల్ భవనానికి రూ.3 కోట్లు

రూ.3 కోట్లు మున్సిపల్ భవన నిర్మాణానికి వెచ్చించనున్నారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్ చాంబర్లతోపాటు విశాలమైన కౌన్సిల్ సమావేశ మందిరం, సెక్షన్ల వారీగా సిబ్బంది గదులు రానున్నాయి. పాత పంచాయతీ కార్యాలయం వద్ద భవన నిర్మాణానికి శిలాఫలకం వేసిన సంగతి తెలిసిందే.

డీపీఆర్ తయారీలో కన్సల్టెన్సీ

టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేసే కాంట్రాక్టు శ్రీవెంకటేశ్వర కన్సల్టెన్సీ దక్కించుకుంది. మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం అధికారుల సూచన మేరకు డీపీఆర్‌ను సిద్ధం చేసే పనిలో కన్సల్టెన్సీ ఉంది. మొత్తం మూడు సంస్థలు పోటీ పడ్డాయి.

త్వరలో టెండర్లు పిలుస్తాం

మున్సిపల్ శాఖ వద్ద డీపీఆర్ ఆమోదం పొందగానే టెండర్లు ఆహ్వానిస్తాం. అనంతరం అభివృద్ధి పనులు ప్రారంభం అవుతాయి. ఈ ప్రక్రియ మొత్తం రెండు నెలల్లో పూర్తికానుంది.

– శ్రీనివాస్, ఆలేరు మున్సిపల్ కమిషనర్

తెల్లవారుజాము నుంచే బారులు



మోత్కూరు పీఏసీఎస్ వద్దకు యూరియా కోసం వచ్చిన రైతులు

మోత్కూరు : మోత్కూరు పీఏసీఎస్‌కు యూరియా వచ్చిందన్న సమాచారంతో శనివారం తెల్లవారుజాము నుంచే రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివచ్చారు. లైన్‌లో గంటల తరబడి నిరీక్షించారు. 334 బస్తాల యూరియా రాగా సీరియల్ ప్రకారం ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. రైతులు అధిక సంఖ్యలో రావడం, యూరియా సప్లై తక్కువగా ఉండటంతో వచ్చిన రైతులందరికీ యూరియా లభించ లేదు.





క్లుప్తంగా

మెరుగైన వైద్యసేవలు అందించాలి

● పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ రవీంద్రనాయక్

యాదగిరిగుట్ట: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. యాదగిరిగుట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించారు. అందిస్తున్న వైద్యుల సేవలపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందితో సమావేశమై జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా వైద్య, డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్, మెడికల్ ఆఫీసర్ పావని, డాక్టర్ హరీష్, సీహెచ్‌వో వెంకటయ్య, పీహెచ్ఎన్ సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ రవీంద్రనాయక్

యాదగిరి క్షేత్రంలో కియోస్క్ యంత్రాలు ప్రారంభం



కియోస్క్ యంత్రాల వినియోగం గురించి తెలుసుకుంటున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సన్నిధిలో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన స్వీయ సేవా కియోస్క్ యంత్రాలను ఈఓ వెంకట్రావ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు ఆలయ ప్రసాద విభాగం వద్ద మూడు, చౌల్ట్రీస్, డోనార్ సెల్, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపాల వద్ద ఒక్కో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిజిటల్ పేమెంట్ ద్వారా కియోస్క్ యంత్రాల ద్వారా భక్తులు సులభంగా దర్శనం, సేవల టిక్కెట్లు, ప్రసాదం, వ్రతాలకు సంబంధించిన టిక్కెట్లను పొందవచ్చన్నారు. భక్తులు వేగంగా, సులభంగా కౌంటర్ల వద్ద ఆలస్యం లేకుండా టిక్కెట్లు బుకింగ్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ, కెనరా బ్యాంక్ అధికారులు, ఆలయాధికారులు పాల్గొన్నారు.





విద్యా కల్పవృక్షం.. ఎంజీయూ

- 2007లో ప్రారంభమైన మహాత్మాగాంధీ యూనివర్సిటీ
- 500 మంది విద్యార్థులతో మొదలై.. ప్రస్తుతం 2500 మందికి ఉన్నత విద్యనందిస్తున్న విశ్వవిద్యాలయం
- కొత్త కోర్సులు, నూతన ఆవిష్కరణలతో ప్రత్యేక గుర్తింపు

రేపు నాల్గవ స్నాతకోత్సవం

నల్లగొండ టూటౌన్: ఒకప్పుడు ఉన్నత విద్య కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు హైదరాబాద్ బాట పట్టేవారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో అనుకున్న కోర్సుల్లో సీట్లు రాక, ఆర్థికంగా ఇబ్బందులతో ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యేవారు. అయితే 2007లో ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక చొరవతో నల్లగొండ పట్టణం సమీపంలో 240 ఎకరాల్లో మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) పురుడు పోసుకుంది. నాడు 500 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఎంజీయూ.. నేడు 2500 మంది విద్యార్థులకు ఉన్నత విద్యనందిస్తూ పేద, మధ్యతరగతి వారికి విద్యా కల్పవృక్షంగా మారింది.

19 కోర్సులు..

ఎంజీయూలో మొత్తం 19 కోర్సులు ఉండగా.. వాటిలో 9 రెగ్యులర్ కోర్సులు, మరో 12 కోర్సులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా ఉన్నాయి. యూనివర్సిటీకి 70 అధ్యాపక పోస్టులు మంజూరు చేయగా.. 35 మందిని మాత్రమే అప్పట్లో రెగ్యులర్‌గా నియమించారు. మిగతా ఖాళీ పోస్టుల్లో 46 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకున్నారు. కోర్సుల వివరాలు: బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, బోటనీ, బిజినెస్ మేనేజ్‌మెంట్, కెమిస్ట్రీ, కామర్స్, కంప్యూటర్స్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్, ఎకనామిక్స్ హిస్టరీ అండ్ టూరిజం, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇంగ్లిష్ తెలుగు అండ్ సైకాలజీ, జియాలజీ, ఇంటర్ డిసిప్లినరీ (మెకానికల్), మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, సైన్స్ అండ్ హ్యూమానిటీస్, సోషల్ వర్క్, ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్, లా. ఇంకా పలు కొత్త కోర్సులు రావాల్సి ఉంది.

ఇంటర్న్‌షిప్‌తో ఉద్యోగావకాశాలు

యూనివర్సిటీలో మరిన్ని కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. విద్యార్థుల్లో స్కిల్స్ పెంచేందుకు కొత్తగా స్కిల్ డెవలప్‌మెంట్ భవనం నిర్మించనున్నారు. కొత్తగా భవనాల నిర్మాణం చేపట్టడం ద్వారా కొత్తగా 56 ప్రోగ్రాం కోర్సులను తీసుకొచ్చేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో రెండు కోర్సులకు తగ్గకుండా కొత్త కోర్సులు తీసుకురానున్నారు. లైబ్రరీని వారంలో రెండు రోజులు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నడిపించనున్నారు. విద్యార్థుల్లో స్కిల్స్ పెంచడంతో పాటు ఇంటర్న్‌షిప్ కల్పించేందుకు ఒక డైరెక్టర్‌ను నియమించారు. వివిధ కంపెనీలతో మాట్లాడి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇది దోహదపడనుంది.

న్యాక్ ఏ ప్లస్ దిశగా అడుగులు

మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రారంభంలో న్యాక్ బీ ర్యాంక్ సాధించింది. ఆ తర్వాత యూనివర్సిటీలో పలు మార్పులు తీసుకురావడం, కొత్త కోర్సులు రావడంతో ప్రస్తుతం బీ ప్లస్ ర్యాంకింగ్‌లో ఉంది. బీ ప్లస్ ర్యాంకింగ్ నుంచి రాబోయే రోజుల్లో ఏ ప్లస్ ర్యాంకింగ్ సాధించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు.



ఎంజీయూలో పాఠాలు వింటున్న విద్యార్థులు



ల్యాబ్‌లో ప్రయోగం చేస్తున్న విద్యార్థిని



యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవార్డుల పంట

మహాత్మాగాంధీ యూనివర్సిటీలో 2009లో ఎన్ఎస్ఎస్ ప్రారంభమైంది. ఐదు యూనిట్లతో ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ నేడు 163 యూనిట్లకు చేరుకుంది. యూనివర్సిటీ పరిధిలో 16 వేల మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి 2018లో హరితమిత్ర అవార్డుతో పాటు రూ.15లక్షల నగదు బహుమతి గెలుచుకున్నారు. అదేవిధంగా 2015లో ఇందిరాగాంధీ జాతీయ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. జాతీయ స్థాయిలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని పలువురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకొచ్చారు.



ఆర్ట్స్ బ్లాక్



సైన్స్ బ్లాక్

నూతన ఆవిష్కరణలతో ప్రత్యేక గుర్తింపు






విద్యార్థులు తయారుచేసిన సోలార్ వాహనం, వాయిస్ కంట్రోల్డ్ డస్ట్‌బిన్

విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ఎంజీయూ ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నారు. 12 మంది ఈఈఈ విద్యార్థులు రూ.3.50లక్షలతో 8 మంది ప్రయాణించే సోలార్ వాహనాన్ని రూపొందించారు. ఈ వాహనానికి నాలుగు గంటలు చార్జింగ్ పెడితే 90 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. అంతేకాకుండా సౌరశక్తితో చార్జింగ్ అయ్యేలా సోలార్ ప్యానెల్స్ బిగించారు. దాదాపు 8గంటల పాటు వాహనం ఎండలో ఉంటే.. బ్యాటరీ చార్జింగ్ అవుతుంది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. దీంతో పాటు అనేక నూతన ఆవిష్కరణలను ఎంజీయూ విద్యార్థులు చేపట్టారు.

కొత్త భవనాల నిర్మాణానికి డీపీఆర్

యూనివర్సిటీ ప్రాంగణంలో కొత్తగా భవనాలు నిర్మించడానికి రూ.322 కోట్లతో డీపీఆర్ తయారు చేయించి ప్రభుత్వానికి పంపారు. ఫార్మసీ కాలేజీ, ఎడ్యుకేషన్ కాలేజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల కోసం కొత్తగా భవనాలు నిర్మించనున్నారు. ఇప్పటికే రూ.60 కోట్లతో ఓ భవనం నిర్మించడానికి టెండర్లు పిలిచారు. స్కిల్ డెవలప్‌మెంట్ భవనం నిర్మాణం జరిగితే ఉమ్మడి జిల్లాలోని వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా స్కిల్స్ పెంపొందించే అవకాశం ఉంది. ఎంజీయూలో మొత్తం 2500 మంది విద్యార్థులు చదువుతుండగా.. అందులో 1900 మంది విద్యార్థులు యూనివర్సిటీ హాస్టల్‌లోనే ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు.

ప్రతిష్టాత్మకంగా ఎదిగింది..



మహాత్మాగాంధీ యూనివర్సిటీ రాష్ట్రంలోనే ఒక ప్రతిష్టాత్మక యూనివర్సిటీగా ఎదిగింది. కొత్త కోర్సులు తీసుకురావడంతో పాటు విద్యార్థుల హాజరు 75 శాతం కచ్చితంగా ఉండాలని నిర్ణయించాం. యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తాం. ఎంతో మంది విద్యార్థులు వివిధ పరిశోధనలను విజయవంతంగా పూర్తిచేయడం యూనివర్సిటీకి ఎంతో గర్వకారణం. **– ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ఎంజీయూ వైస్ ఛాన్స్‌లర్**



యూనివర్సిటీలోని రాక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల రాళ్లు

స్నాతకోత్సవ సంబురం

ఎంజీయూ నాల్గవ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. సోమవారం యూనివర్సిటీలో నిర్వహించే స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. ఈ స్నాతకోత్సవంలో 22 మంది రీసెర్చ్ స్కాలర్స్ పీహెచ్‌డీ పట్టాలు, 57 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ అందుకోనున్నారు. యూనివర్సిటీ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తంగా 150 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ లభించగా.. 39 మంది రీసెర్చ్ స్కాలర్స్ పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. అదేవిధంగా 2022, 23, 24 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తిచేసిన 16,210 మందికి, పీజీ పూర్తిచేసిన 3200 మందికి వారికి, బీఈడీ పూర్తిచేసిన 7800 మందికి పట్టాలు అందజేయనున్నారు.

రూ.232 కోట్లతో పోలీసు గృహాల నిర్మాణం

● రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్ర వ్యాప్తంగా రూ.232 కోట్లతో పోలీసు అధికారులు, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణాలు చేపడుతున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్మించిన ఏఆర్ డీఎస్పీ రెసిడెన్షియల్ క్వార్టర్, సీఐ, ఎస్ఐ క్వార్టర్లను, శిశువిహార్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శిథిలావస్థలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది క్వార్టర్లను తొలగించి వాటి స్థానంలో కొత్త క్వార్టర్లు నిర్మిస్తున్నామన్నారు. ఎక్కడైనా క్వార్టర్లు శిథిలావస్థలో ఉంటే వాటిని తొలగించి కొత్తగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ ఎండీ రమేష్‌రెడ్డిని మంత్రి ఆదేశించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయం 50ఏళ్ల క్రితం నిర్మించిందని, త్వరలో దాని స్థానంలో కొత్తది నిర్మిస్తామని చెప్పారు. అదేవిధంగా ముఖ్యమంత్రితో మాట్లాడి ఏఆర్ కానిస్టేబుళ్ల క్వార్టర్లు కూడా నూతనంగా నిర్మిస్తామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది 24గంటలు పనిచేస్తారని వారికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. సమాజంలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐజీ తఫ్సీర్ ఇక్బాల్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఏసీపీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీ క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్, ఐజీ, ఎస్పీ

విద్యార్థినిని వేధిస్తున్న టీచర్‌పై పోక్సో కేసు

నకిరేకల్: విద్యార్థినిని వేధిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై నకిరేకల్ పోలీసులు శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ జెడ్పీహెచ్ఎస్ ఇంగ్లిష్ టీచర్ మామిడి శ్రీనివాస్ స్థానికంగా తనకున్న ప్రైవేట్ ఒకేషనల్ కాలేజీకి రావాలని అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని మూడు నెలలుగా అడుగుతూ వేధిస్తున్నాడు. అంతేకాకుండా ప్రతిరోజు తనతో మాట్లాడాలని విద్యార్థినిని వేధిస్తుండడంతో ఆమె విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో సదరు విద్యార్థిని కుటుంబ సభ్యులు శనివారం నకిరేకల్‌లోని స్టేడియం వీధిలో ఉంటున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి అతడికి దేహశుద్ధి చేశారు. అనంతరం శ్రీనివాస్‌పై నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఉపాధ్యాయుడు మామిడి శ్రీనివాస్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు నకిరేకల్ సీఐ వెంకటేష్ తెలిపారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్..

ఈ ఘటనపై ఎంఈఓ మేక నాగయ్య విచారణ చేసి నివేదికను జిల్లా విద్యాశాఖకు పంపించారు. ఈ విచారణ నివేదికతో పాటు మీడియా ద్వారా వచ్చిన కథనాలను పరిశీలించిన డీఈఓ భిక్షపతి.. ఉపాధ్యాయుడు మామిడి శ్రీనివాస్‌ను సస్పెన్షన్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మోతె: టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన మోతె మండలం మామిళ్లగూడెం గ్రామ శివారులో సూర్యాపేట–ఖమ్మం(365బి) జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్లచెర్వు గ్రామానికి చెందిన గుండమాల వెంకన్న(50) పని నిమిత్తం తన టీవీఎస్ ఎక్సెల్‌పై మోతె మండల కేంద్రానికి వచ్చి, తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. మార్గమధ్యలో మామిళ్లగూడెం గ్రామ శివారులో వెనుక నుంచి ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకన్నను స్థానికులు 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమార్తె వడ్డేటి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

కాసేపు కసరత్తు..

నల్లగొండ : రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ డీఎస్పీ, సీఐ, ఎస్ఐ క్వార్టర్లను, అదేవిధంగా శిశువిహార్‌ను ప్రారంభించారు. అనంతరం పోలీస్ కార్యాలయంలోని జిమ్‌లో మంత్రి కాసేపు కసరత్తు చేసి.. అందరినీ ఉత్సాహపరిచారు.



సాగర్ ఎడమ కాలువలో వ్యక్తి గల్లంతు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నాగార్జునసాగర్ ఎడమ కాలువలో వ్యక్తి గల్లంతైన విషయం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం సుంకిశాలతండాకు చెందిన కేశావత్ శ్రీనునాయక్(45) ఐదేళ్లుగా పెద్దవూర మండలం పొట్టివానితండాలో భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పొట్టివానితండాకు చెందిన రమావత్ దత్తు శుక్రవారం శ్రీనునాయక్ పత్తి చేనులో అరక తోలడానికి వచ్చాడు. అయితే దత్తు కుమార్తె అంజలికి కొంత కాలంగా ఆరోగ్యం బాగుండకపోవడంతో అతడి భార్య, మరో వ్యక్తి కలిసి అంజలిని అల్వాల గ్రామ శివారులోని సాగర్ ఎడమ కాలువ పక్కన దర్గా వద్ద గల బావూజీ(మంత్రగాడు) వద్దకు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని దత్తు శ్రీనునాయక్‌కు చెప్పి.. తాను అరక తోలుతున్న కావున శ్రీనునాయక్‌ను బావూజీ వద్దకు వెళ్లాలని కోరాడు. దీంతో శ్రీనునాయక్ బావూజీ పూజలు చేసే ప్రదేశానికి వెళ్లి దత్తు కుమార్తె అంజలికి పూజలు చేయించారు. అనంతరం దత్తు కుమార్తె అంజలికి స్నానం చేయించడానికి ఆమెతో పాటు శ్రీనునాయక్ సాగర్ ఎడమ కాలువలోకి దిగాడు. బాలిక స్నానం చేస్తున్న క్రమంలో కాలుజారి కాలువలో పడిపోయింది. శ్రీనునాయక్ గమనించి వెంటనే కాలువలోకి దూకి బాలికను ఒడ్డుకు చేర్చాడు. అనంతరం శ్రీనునాయక్ ఒడ్డుకు వస్తున్న క్రమంలో అప్పటికే అలసిపోయిన అతడు నీటి ప్రవాహానికి కాలువలో కొట్టుకుపోయాడు. ఎంత గాలించినా శ్రీనునాయక్ ఆచూకీ తెలియకపోవడంతో అతడి భార్య బుజ్జి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు.



శ్రీనునాయక్

కాలువలో దూకి మహిళ ఆత్మహత్య

త్రిపురారం: నాగార్జునసాగర్ ఎడమ కాలువలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామంలో జరిగింది. శనివారం త్రిపురారం ఎస్ఐ గైకూరి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాబుసాయిపేట గ్రామానికి చెందిన సకినాల రాధమ్మకు ఆమె భర్త రాధాకృష్ణతో ఈ నెల 10న ఆర్థిక వ్యవహారాల విషయమై గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రాధమ్మ అదే రోజు ఇంట్లో నుంచి వెళ్లిపోయి నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో దూకింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం 8గంటల సమయంలో పెద్ద దేవులపల్లి చిన్న చెరువులో కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో రాధమ్మ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త రాధాకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్యాంపు కార్యాలయం ముట్టడి.. నిర్వాసితుల అరెస్టు

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాగా.. రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న గట్టుప్పల్ మండలానికి చెందిన పలువురు రైతులు మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. అయితే భూనిర్వాసితులు నల్లగొండకు రాకుండా ముందస్తుగానే కొంతమందిని గట్టుప్పల్‌లో పోలీసులు అరెస్టు చేశారు. కొందరు నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి రాగా.. వారిని కూడా నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి అనంతరం వదిలేశారు. తమకు మార్కెట్ ధర కట్టించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో తాము మంత్రితో మాట్లాడతామని భూనిర్వాసితులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.



మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి వచ్చిన రైతులను వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

మర్రిగూడ: ఆర్టీసీ బస్సును టిప్పర్ బస్సు ఢీట్టిన ఘటన మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చండూరు నుంచి మాల్‌కు వెళ్తుండగా.. మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామంలోని యూనియన్ బ్యాంక్ మలుపు వద్ద ఎదురుగా టిప్పర్ అతివేగంగా వచ్చి బస్సును ఢీకొట్టింది. కాగా ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. శివన్నగూడెం రిజర్వాయర్ ప్రాంతం నుంచి టిప్పర్లు అతి వేగంతో వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు స్పందించి టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Services

గోల్డ్ పోయినది

■ **జె. సందీప్** అను నేను బస్టాండ్ నుండి రామగిరికి బైక్ పై వస్తుండగా 105 గ్రాముల బంగారం, 11 తులాల బంగారు హారం పోయింది. కావున ఎవరికైనా దొరికిన మరియు తెలిసిన ఈ 9866995896, 9440120021, నంబర్‌కు సంప్రదించగలరు. నోట్ : ఈ విషయం తెలియజేసిన, వారికి తెచ్చిన వారికి లక్ష రూపాయలు నగదు బహుమతి ఇవ్వబడును. [SCA25007917]

Real Estate

PLOTS FOR SALE

■ **Opp MRO Office,** MLG, Vidyanagar, North of Medhari Community Hall, Gated Vencher, 30" W/F Road, Plots Nos 35,36, 37,38 Cell : 8074762705 [SCA25007960]

■ రామోజీ ఫిలిం సిటీ దగ్గర హైవే కి 3rd బిట్టు 450 చ॥గలు నార్త్, ఈస్ట్ 30 ft Road & బాటసింగారం విజయవాడ హైవే కి 2km దూరంలో 1100 చ॥గజాల నార్త్, ఈస్ట్, సౌత్ 3 సైడ్ రోడ్లు గల ప్లాట్స్ అమ్మబడును సంప్ర సెల్ : 9963961666 [SCA25008069]

HOUSE FOR SALE

■ నల్లగొండ పట్టణం పద్మావతి కాలనీలో మెయిన్ రోడ్ 3000 SFT ఈస్ట్ ఫేస్ (3ఫ్లోర్స్) గల ఇల్లు అమ్మబడును. సంప్ర॥ సెల్ : 9550540116 [SCA25008111]

Wanted

■ **Walk in Interview** for Electricians, Plumbers, Supervisors. Ph: 7989896938 [HA-15521]

■ **Granite Block Marker required** at Madanapalli. 9844030831, kandoi@indiagranite.com [HA-15522]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ వార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్, నర్సులు, కాంపౌండర్స్,వాచ్‌మెన్స్, సెక్యూరిటీ గార్డ్స్, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453/ 9391036931 [HA-16042]

■ **రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ (TG NO-1)** నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబికేర్ కై M/F వర్కర్స్ కా॥. బో+వ+జీతం: 16–18 వేలు. 9989371122/ 9553461177 [SCA25007925]

■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ *Suryapeta, Nalgonda* జిల్లాలో పని చేయుటకు *Field Executives* కావలెను. (Sal 15K to 22K) + Inc. సంప్రదించండి: ☏ 96769 04994 [SCA25008114]

■ మిర్యాలగూడ, సూర్యాపేటలో **SBS** మాడ్యులర్ కిచెన్, కబోర్డ్స్ నందు వర్క్ చేయుటకు 2 వీలర్ కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 9949445899 [G-1037]

■ **Wanted Lectures** for English, Maths, Chemistry, MCA, Accountant & AO, Scholarship incharge, Lady Hostel warden, PET, Cook, Driver, Watchman, Workers. MLG. 9866349247, 9848207323. [Y_1145170]

■ **Required HR Cum Admin Manager** for Manufacturing Company at Nindra, Chittoor Dist UG / PG with Min.12yrs Exp, Role: HR, Compliances,Liasoning,Admin, EMail:hr@tyromerindia.com [SCA25008137]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటిసంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.